క్లుప్తంగా

కోర్టు కానిస్టేబుళ్లకు డీఎస్పీ అభినందన



కానిస్టేబుల్ నర్సింహారావును అభినందిస్తున్న డీఎస్పీ అబ్దుల్ రెహమాన్

కొత్తగూడెంటౌన్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని 1, 3 లక్ష్మీదేవిపల్లి పోలీసు స్టేషన్ల కోర్టు కానిస్టేబుళ్లను కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ అభినందించారు. గురువారం కొత్తగూడెంలోని డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీని కొత్తగూడెం వన్‌టౌన్, త్రీటౌన్, లక్ష్మీదేవిపల్లి పోలీసు స్టేషన్ల కోర్టు కానిస్టేబుళ్లు ఏ.నర్సింహారావు, శోభన్, రామకృష్ణ కలిశారు. ఈ సందర్భంగా డీఎస్పీ వారిని కొత్తగూడెం సబ్ డివిజన్ పరిధిలోని కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కామయ్యేలా చేసినందుకు అభినందిస్తూ పోలీసు యూనిఫాం అందించి సన్మానించారు.

10నుంచి క్రికెట్ టోర్నీ



మాట్లాడుతున్న ఎస్కే చాంద్‌పాషా

జూలూరుపాడు: ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 10 నుంచి జూలూరుపాడులో మూడు మండలాల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించనున్నట్లు ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి ఎస్కే చాంద్‌పాషా తెలిపారు. గురువారం మాట్లాడుతూ.. ఏన్కూరు, జూలూరుపాడు, చండ్రుగొండ మూడు మండలాల స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రథమ బహుమతి రూ.15,116, ద్వితీయ రూ.10,116, తృతీయ రూ.8,116, నాలుగో బహుమతి రూ.5,116, షీల్డ్‌లు అందజేయడం జరుగుతుందన్నారు. వివరాలకు 9502079142, 7730891493 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఆర్థిక సాయం

పాల్వంచ: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కేటీపీఎస్ 6వ దశకు చెందిన ఆర్టిజన్ తాటి దేవదానం కుటుంబానికి కేటీపీఎస్ ఉద్యోగ, కార్మికులు ఆర్థిక సహాయం అందించారు. మానవతా దృక్పథంతో ఇంజనీర్లు, ఓఅండ్ఎం కార్మికులు, ఆర్టిజన్ కార్మికులు కలిసి రూ.1.05 లక్షల నగదును సేకరించారు. గురువారం సీఈ కార్యాలయంలో సీఈ ఎం.ప్రభాకర్‌రావు చేతుల మీదుగా దేవదానం కుటుంబానికి అందించారు. కార్యక్రమంలో ఎస్‌ఈలు జీవీ ధర్మారావు, వి.వెంకటేశ్వర్లు, శర్మాస్‌వలీ, వి.శ్రీనివాస్, జయప్రకాశ్, శ్రీనివాస్, రాధాకృష్ణ పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

ఇల్లెందు: ఇల్లెందు సింగరేణి హైస్కూల్‌లో ఓ ఉపాధ్యాయుడు అక్కడి విద్యార్థుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన సంఘటనపై కఠిన చర్యలు తీసుకోవాలని వామపక్ష విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు గురువారం కొత్తగూడెంలోని ఎడ్యుకేషన్ జీఎం కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఫాహీం, అభిమన్యు, మంజుల, గణేష్ పాల్గొన్నారు.

'గృహజ్యోతి'ని సద్వినియోగం చేసుకోండి

టేకులపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న గృహజ్యోతి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని టేకులపల్లి, బొమ్మనపల్లి ఏఈలు హెచ్ దేవ, బుజ్జి కన్నయ్య తెలిపారు. ఈ మేరకు గురువారం మండలంలోని పలు గ్రామాలను వారు సందర్శించి విద్యుత్ వినియోగదారులకు గృహజ్యోతి పథకంపై అవగాహన కల్పించారు. 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించే వినియోగదారులు వారి ఆధార్, రేషన్ కార్డు, ప్రజాపాలన రశీదు, మొబైల్ నంబర్, కరెంట్ బిల్లు ధ్రువీకరణ పత్రాలను మీటర్ రీడింగ్ తీసే సిబ్బందికి అందజేసి గృహజ్యోతికి అర్హత పొందాలని సూచించారు.

'పల్లె' పాలనపై చెరగని ముద్ర



సరోజిని, సర్పంచ్, పోలారం



ఉప్పు దీప్తి, కార్యదర్శి, పోలారం



భాగ్యమ్మ, సర్పంచ్, ఒడ్డుగూడెం



ప్రశాంతి, సర్పంచ్, తిలక్‌నగర్



ఎం.కృష్ణ, సర్పంచ్, మాణిక్యారం



తిరుపతి, సర్పంచ్, దనియాలపాడు



జి.సంతు, సర్పంచ్, బోయితండా

పల్లెలే దేశాభివృద్ధికి పట్టుగొమ్మలన్న మాటలను కొందరు మాజీ సర్పంచ్‌లు నిజం చేశారు. నమ్మకంతో గెలిపించినందుకు గ్రామాలను అభివృద్ధి బాట పట్టించారు. ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులతోపాటు దాతల చేయూతను సద్వినియోగం చేసుకున్నారు. కొంతమంది పంచాయతీ ప్రజల మేలు కోరి వినూత్న ఆలోచనలతో పలు సౌకర్యాలను అందుబాటులోకి తెచ్చారు. ఇలా ప్రజలకు ఉపయోగపడేలా పలు అభివృద్ధి పనులు చేసి ఉన్నతాధికారుల చేత అవార్డులు అందుకోవడంతోపాటు స్థానికుల చేత శభాష్ అనిపించుకున్నారు. కొన్ని పంచాయతీల్లో సర్పంచ్‌లతోపాటు కార్యదర్శులు సైతం అంకితభావం చూపి పల్లె ప్రగతిలో తమదైన మార్క్ చూపించారు.

- దాతల చేయూతతో కొందరు..
- వినూత్న ఆలోచనలతో మరికొందరు
- అభివృద్ధి చేసి ఆదర్శంగా నిలిచిన సర్పంచ్‌లు



దనియాలపాడులో భూదాన పత్రం అందజేస్తున్న దాతలు (ఫైల్)

ఇల్లెందురూరల్: పోలారం గ్రామపంచాయతీకి రెండు పర్యాయాలు సర్పంచ్‌గా పనిచేసిన వాంకుడోత్ సరోజిని గడిచిన ఐదేళ్లగా పంచాయతీకి మంజూరైన నిధులను సద్వినియోగం చేసుకొని అభివృద్ధిని పరుగులు పెట్టించారు. మండలంలో ఎవరూ సాహసించని రీతిలో ప్రజల భాగస్వామ్యంతో గ్రామపంచాయతీలో వినూత్నంగా సంతను ఏర్పాటు చేసి అందరి మన్ననలు పొందారు. ప్రస్తుతం సంత దినదినాభివృద్ధి చెందుతూ పంచాయతీకి ఆదాయ వనరుగా మారింది. ఇంతే కాకుండా దాతలను సంప్రదించి ప్రతీఇంటికి చెత్త బుట్టలను పంపిణీ చేశారు. సర్పంచ్ ఆలోచనకు తన మేధస్సును కలగలిపి పంచాయతీని అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడం ద్వారా కార్యదర్శి ఉప్పు దీప్తి ఐదేళ్లలో రెండుసార్లు జిల్లా స్థాయిలో ఉత్తమ అవార్డులను అందుకుంది.

దాతల సాయంతో..

మండలంలోని చిన్న గ్రామపంచాయతీలలో ధనియాలపాడు ఒకటి. పంచాయతీ పరిధిలో అటవీభూములు తప్ప రెవెన్యూ సంబంధిత భూములు లేవు. అటవీ భూములు కూడా గ్రామానికి దూరంగా ఉన్నాయి. దీంతో సర్పంచ్‌గా నూనావత్ తిరుపతి గ్రామపెద్దలను ఆశ్రయించి వారి తోడ్పాటుతో దాతలను సంప్రదించి రెండు ఎకరాల భూమిని పంచాయతీకి సమకూర్చుకున్నారు. ఆ స్థలంలో వైకుంఠధామం, డంపింగ్ యార్డు, గ్రామపంచాయతీ కార్యాలయం వంటి నిర్మాణాలు చేపట్టారు. తాను సర్పంచ్‌గా ఎన్నికైన సమయంలో పంచాయతీలో ఒక్క సీసీ రోడ్డు ఉండేది కాదు. నేతలను పలుమార్లు కలవడం ద్వారా ప్రస్తుతం పంచాయతీ పరిధిలో అన్ని వీధులలో సీసీ వేయించుకోగలిగారు.

మహిళల చైతన్యం..

మాణిక్యారం గ్రామపంచాయతీలో అనేక మంది మద్యానికి బానిసలై చిరుప్రాయంలోనే తనువు చాలిస్తున్నారు. భర్తను కోల్పోయిన మహిళలకు కుటుంబ పోషణలో ఎదరవుతున్న ఇబ్బందులను గమనించి సర్పంచ్ మోకాళ్ల కృష్ణ గ్రామపెద్దల సహకారంతో మద్యాన్ని గ్రామం నుంచి దూరం చేసే ప్రయత్నం చేశారు. కొంతకాలం విజయవంతంగా కొనసాగినా ప్రభుత్వ విధానపరమైన నిర్ణయాల కారణంగా ఎక్కువ కాలం అడ్డుకోలేకపోయారు. కానీ ఆ కొన్ని రోజులు మహిళలు అందిపుచ్చుకున్న చైతన్యం మద్యం విక్రయాలు అదుపులో ఉండేలా చేశాయి. అంతేకాకుండా కరోనా సమయంలో సర్పంచ్‌గా కృష్ణ బాధితులకు వ్యక్తిగతంగా ఆర్థికంగా, ఆహార రూపంలో తనవంతు సహాయాన్ని అందించారు. ప్రజలను చైతన్యపరిచి ఇంటి పన్నులు ప్రతీఒక్కరూ చెల్లించేలా సర్పంచ్ చేసిన కృషి ఇతర పంచాయతీలకు ఆదర్శంగా నిలిచి అంతటా ఇంటి పన్నులు సకాలంలో చెల్లించేలా ప్రోత్సహించింది.



పోలారంలో కొనసాగుతున్న వారపు సంత

తొలి అవార్డు సొంతం చేసుకుని..

అక్షర జ్ఞానం లేకున్నా.. పరిపాలనపై కనీస పరిచయం లేకున్నా .. సర్పంచ్‌గా తాను వేసిన తొలి అడుగులోనే పంచాయతీని సుందరంగా తీర్చిదిద్దింది. ఒడుదుడుకులను ఎదుర్కొంటూనే నిరంతరం గ్రామాలను సందర్శిస్తూ అభివృద్ధిని పరుగులు పెట్టించింది. ఫలితంగా తొలి ఏడాదిలోనే జిల్లాలోనే ఉత్తమ పంచాయతీగా అవార్డును తన సొంతం చేసుకుంది ఒడ్డుగూడెం సర్పంచ్ చాట్ల భాగ్యమ్మ. ఈ అవార్డు ద్వారా రూ.20 లక్షల నిధులను పంచాయతీకి సాధించి పెట్టింది. ఈ నిధుల సహాయంతో జిల్లాలో ఏర్పడిన నూతన పంచాయతీలలో తొలిగా పంచాయతీ భవనం నిర్మించుకున్న గ్రామంగా గుర్తింపు తెచ్చింది. గ్రామపంచాయతీలో ఐశ్వర్యవంతులు ఉన్నప్పటికీ వారి వద్ద చేయి చాచకుండా కేవలం ఖాళీ స్థలాన్ని దానంగా పంచాయతీకి ఇప్పించి పంచాయతీ భవనం, హెల్త్ సబ్‌సెంటర్ నిర్మాణ పనులను సకాలంలో పూర్తి చేయించి అందరిచేత శభాష్ అనిపించుకున్నారు.

గ్రామాల్లో శానిటేషన్ పనులు

జూలూరుపాడు: ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో పారిశుద్ధ్యం, పిచ్చి మొక్కల తొలగింపు వంటి శానిటేషన్ పనులు నిర్వహించారు. గ్రామాల్లో చెత్తా చెదారం, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ కార్యాలయాలు, పంచాయతీ కార్యాలయం, ఆలయాల ప్రాంగణాలు, పరిసరాలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ప్రత్యేక అధికారులు ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, తహసీల్దార్ శారద, ఎంపీఓ తులసీరామ్, ఎఫ్‌ఆర్‌ఓ జి.ప్రసాద్‌రావు, విద్యుత్‌శాఖ ఏఈ సతీష్, ఏఓ ఎస్.రఘుదీపిక, పశువైద్యాధికారి బి.బద్దులాల్, ఎంఈఓ వెంకట్, ఇరిగేషన్ ఏఈ మీనా, డిప్యూటీ తహసీల్దార్ గౌతమ్, పీహెచ్‌సీ సీహెచ్‌ఓ వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



భోజ్యాతండా ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో శుభ్రం చేస్తున్న ఎంపీపీ సోని

10 నుంచి మాఘమాస పూజలు

కొత్తగూడెంటౌన్: శ్రీవిజయ విఘ్నేశ్వరస్వామి దేవస్థానం (గణేష్‌టెంపుల్)లో ఈనెల 10 నుంచి మార్చి 12వ తేదీ వరకు, మాఘమాసం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ కె.సులోచన గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శ్రీఛాయా ఉషా పద్మినీ సమేత సూర్యనారాయణ స్వామి వారికి ప్రతీరోజు సూర్యనమస్కార కార్యక్రమములు నిర్వహించనున్నట్లు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

11న సాహిత్య సదస్సు, కవి సమ్మేళనం

టేకులపల్లి: నెలనెలా సాహిత్య దీపావళి కార్యక్రమంలో భాగంగా ఈ నెల 11న ఏలూరు జిల్లా కొయ్యలగూడెంలో శ్రీశ్రీ కళా వేదిక, పత్ర సమర్పణ, సాహిత్య సదస్సు, జాతీయ కవి సమ్మేళనం నిర్వహిస్తోందని ఆ సంస్థ కొత్తగూడెం జిల్లా కమిటీ సభ్యుడు చంద్ర వెంకటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భాషా సాహిత్యాభిమానులు, కవులు, రచయిలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఉచిత భోజన, వసతి సౌకర్యాలతో పాటు మెమెంటో, సర్టిఫికెట్, సన్మానం ఉంటుందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మద్యం సిండికేట్‌పై విచారించండి..



మాట్లాడుతున్న కామేష్

కొత్తగూడెంఅర్బన్: ఎక్సైజ్ అధికారులు మద్యం సిండికేట్‌కు అనుమతి ఇచ్చారా..? లేదంటే వ్యాపారులకు అమ్ముడుపోయారా...? అని బీఎస్పీ పార్లమెంట్ జోనల్ ఇన్‌చార్జ్ యెర్రా కామేష్ ప్రశ్నించారు. గురువారం కొత్తగూడెం క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో మద్యం సిండికేట్ నడుస్తున్నా ఎక్సైజ్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని, ఎమ్మెల్యేగా కూనంనేని గెలిచాక పాల్వంచలో సిండికేట్ నడిపే ఆయన సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి జిల్లా కేంద్రంలో మద్యం దుకాణాలు దక్కించుకున్న వారితో నిబంధనలకు విరుద్ధంగా స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేసుకొని సిండికేట్ దందా నడిపిస్తున్నాడని ఆరోపించారు. ఏ పార్టీ నాయకుడు ఎమ్మెల్యేగా గెలిచినా సిండికేట్ వ్యాపారం ద్వారా రూ.కోట్లు చేతులు మారుతున్నాయని దీనిపై ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. దీనిపై ఇప్పటికే కలెక్టర్, ఎస్పీకి వినతిపత్రాలు అందజేసినట్లు తెలిపారు. ఇప్పటికైనా ఎక్సైజ్ అధికారులు మొద్దునిద్ర వీడి చర్యలు తీసుకోవాలని లేదంటే ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సాయి, చెనిగారపు నిరంజన్‌కుమార్, నాగుల రవికుమార్, అల్లకొండ శరత్, ధనుంజయ్ పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

పాల్వంచ: కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను తప్పక అమలు చేస్తుందని డీసీఎంఎస్ వైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. గురువారం ఇంటింటికీ ఉచిత విద్యుత్ అమలుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టడం పట్ల కూరగాయల మార్కెట్ ఏరియాలో రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి, కేక్ కట్ చేశారు. మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీల్లో భాగంగా ఆరు గ్యారంటీల అమలుకు ప్రణాళికలు రూపొందించడం జరిగిందన్నారు. త్వరలోనే గృహలక్ష్మి పథకం అమల్లోకి వస్తుందన్నారు. పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం అన్నారు. కార్యక్రమంలో బద్ది కిషోర్, కొండెం వెంకన్న, కందుకూరి రాము, చాంద్ పాషా, భట్టు మురళీ, మధు, గిరి ప్రసాద్, రేగళ్ల శ్రీను, నాగేశ్వరరావు, సూర్యకిరణ్, మహేశ్ పాల్గొన్నారు.



కొత్వాలకు కేక్ తినిపిస్తున్న నాయకులు

సొసైటీ వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం?

ఇల్లెందు: ఇల్లెందు కోఆపరేటివ్ సహకార సంఘం (పీఏసీఎస్) ఉపాధ్యక్షుడు బండారు శ్రీనివాస్ మీద అవిశ్వాసం పెట్టేందుకు కాంగ్రెస్ నాయకులు సమాలోచనలు చేస్తున్నారు. గురువారం వైస్ ఎంపీపీ ప్రమోద్ మీద అవిశ్వాసం ప్రవేశపెట్టిన సందర్భంగా సొసైటీ వైస్ చైర్మన్ మీద కూడా అవిశ్వాసం పెట్టాలని ఆలోచిస్తున్నట్లు సమాచారం. ఇల్లెందు సొసైటీకి 2000 ఫిబ్రవరి 15న ఎన్నికలు జరిగాయి. మరో ఏడాది పదవీకాలం ఉంది. ఈ తరుణంలో బండారి శ్రీనివాస్ బీఆర్ఎస్ పార్టీలో ఉన్నందున ఆయనను గద్దె దించేందుకు అవిశ్వాస నోటీసు అందజేయాలని అందుకు తగిన సంఖ్యాబలం కోసం రాజకీయ లెక్కలు వేస్తున్నారు. ఇల్లెందు సొసైటీలో 13 వార్డులున్నాయి. మారిన పరిస్థితుల్లో మెజార్టీ సభ్యులు కాంగ్రెస్ పార్టీలో ఉన్నారు. అందరినీ సమీకరించేందుకు ప్రణాళిక రచిస్తున్నారు. సొసైటీ డైరెక్టర్లు వీరే... రావుల రమేష్, మెట్టెల రామకృష్ణ, కున్సోతు రాము, వల్లాల కొమురయ్య, బండారి శ్రీనివాస్, గుంటి వెంకటేశ్వర్లు, నిట్టా నిర్మల, ఇరుప మల్లమ్మ, కిన్నెర నర్సయ్య, రామటెంకి లక్ష్మీ, నూనావత్ లష్కర్, పోలెపల్లి నాగేశ్వరరావు, పూనెం కోటయ్య(ఏకగ్రీవం) ఉన్నారు.

సుజాతనగర్ ఎంపీపీపై..

సుజాతనగర్: సుజాతనగర్ ఎంపీపీ భూక్యా విజయలక్ష్మిపై అవిశ్వాసానికి సన్నాహాలు చేస్తున్నట్లుగా తెలుస్తోంది. ఈ మేరకు ఆమెపై అవిశ్వాస తీర్మానం పెట్టాలని కోరుతూ మెజారిటీ సభ్యులు కొత్తగూడెం ఆర్డీఓ శిరీషను బుధవారం కలిసి ఫిర్యాదు చేశారు.

మండలంలో మొత్తం ఎనిమిది మంది ఎంపీటీసీ సభ్యులు ఉండగా వీరిలో నర్సింహాసాగర్, గరీబ్‌పేట, సర్వారం, సీతంపేట బంజర, నాయకులగూడెం (మొత్తం ఐదుగురు) ఎంపీటీసీలు అవిశ్వాస తీర్మానం పెట్టాలని కోరారు. మండలంలో జరిగే అభివృద్ధి పనుల విషయంలో గానీ, ప్రభుత్వం నుంచి విడుదలయ్యే నిధుల విషయంలో గానీ తమకు సమాచారం ఇవ్వకుండా నియంతృత్వ ధోరణితో వ్యవహరిస్తున్నారని సభ్యులు ఆరోపించారు. మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసి ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడానికి అనుమతి ఇవ్వాలని కోరారు. వైస్ ఎంపీపీ బానోత్ అనిత, ఎంపీటీసీలు కసనబోయిన భద్రం, బానోత్ విజయ్ కుమార్, భూక్యా పద్మావతి, బత్తుల మానస పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలను దెబ్బతీస్తోంది..



మాట్లాడుతున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): బీజేపీ ప్రభుత్వం ఫెడరల్ విలువలను దెబ్బతీస్తూ, రాష్ట్రాలను నిర్వీర్యం చేస్తున్న విధానాలను ఎండగట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య అన్నారు. కేంద్ర ప్రభుత్వం భారత రాజ్యాంగ విలువలను ఖూనీ చేస్తూ, ఫెడరల్ స్ఫూర్తికి విఘాతం కలిగిస్తూ బీజేపీయేతర రాష్ట్రాలను నిర్వీర్యం చేసే విధానాలను నిరసిస్తూ ఢిల్లీలో కేరళ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన నిరసన కార్యక్రమానికి సంఘీభావంగా గురువారం కొత్తగూడెంలోని మంచికంటి భవన్ నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ప్రదర్శన నిర్వహించారు. అన్నవరం మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం దేశంలోని బీజేపీయేతర రాష్ట్రాల హక్కులను లాక్కుని స్వయం ప్రతిపత్తిని దెబ్బతీస్తోందని, రాష్ట్రాలను పూర్తిగా నిర్వీర్యం చేస్తోందన్నారు. రాష్ట్రాలకు రావాల్సిన పన్నుల వాటా ఇవ్వడం లేదని, గవర్నర్‌ను ప్రయోగించి రాష్ట్ర పరిపాలనా వ్యవస్థను దెబ్బతీస్తోందన్నారు. కేరళ, తమిళనాడు, కర్నాటక, తెలంగాణ రాష్ట్రాలకు బడ్జెట్ కేటాయింపుల్లో తీవ్ర పక్షపాతం, చూపుతోందని విమర్శించారు.

14 నుంచి శ్రీసమ్మక్క, సారలమ్మ మినీ జాతర

జూలూరుపాడు: పడమటనర్సాపురంలో కొలువై ఉన్న శ్రీసమ్మక్క–సారలమ్మ మినీ జాతర అంగరంగ వైభవంగా జరగనుంది. ఈ మేరకు కరపత్రాలను గురువారం అమ్మవార్ల సన్నిధిలో జాతర నిర్వాహణ కమిటీ సభ్యులు, కుల, గ్రామపెద్దలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈనెల 14, 15, 16వ తేదీల్లో జాతర జరగనున్నట్లు తెలిపారు. ఆదివాసీ గిరిజన సంస్కృతి, సంప్రదాయాలతో జరిగే జాతర మహోత్సవానికి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి వనదేవతలను దర్శించుకొని, మొక్కులు చెల్లించుకోవాలని కోరారు. ప్రధాన పూజారి కట్రం నరసింహారావు, గ్రామపెద్దలు కాజా రమేష్, కులపెద్దలు ముక్తి కృష్ణారావు, కట్రం పుల్లయ్య, బచ్చల కృష్ణయ్య, కోడెం సైదులు, బచ్చల సారయ్య, బాడిసా నాని, పదిమల చందర్ రావు, ఎస్కే ముస్తాఫా పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

నాయకులతో చర్చించే నిర్ణయం తీసుకున్నాం..



మాట్లాడుతున్న జనక్ ప్రసాద్

సింగరేణి(కొత్తగూడెం): కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘమైన ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు సంజీవరెడ్డి, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులతో చర్చించిన తరువాతే కొత్తగూడెం రీజియన్‌లోని నాలుగు ఏరియాల్లో (కొత్తగూడెం ఏరియా, కొత్తగూడెం కార్పొరేట్, ఇల్లెందు, మణుగూరు) ఏరియాల ఉపాధ్యక్షుల ఎంపిక చేయటం జరిగిందని ఆ యూనియన్ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ తెలిపారు. గురువారం రాత్రి కొత్తగూడెంలోని ట్రాన్సిట్ గెస్ట్ హౌజ్‌లో ఏర్పాటు చేసిన యూనియన్ జనరల్ బాడీ సమావేశంలో మాట్లాడారు. ఈ విషయం తెలియని కొంతమంది నాయకులు, కార్యకర్తలు నిరసనలు, ఆందోళనలు చేపట్టారని ఇది సరైంది కాదన్నారు. ఐఎన్‌టీయూసీ యూనియన్‌లో పదవులు కీలకం కాదని, పదవులు లేకున్నా కార్మికుల సమస్యలపై పోరాడతామని, సుమారు పన్నెండు ఏళ్లు ఎలాంటి పదువు లు లేకున్నా యూనియన్ కోసం పనిచేశామన్నారు. ఇదిలా ఉండగా.. నాలుగు ఏరియాల ఉపాధ్యక్షుల పదవులు రద్దు చేసి ఏరియాల వారీగా యూనియన్ అంతర్గత ఎన్నికలు నిర్వహించి ఉపాధ్యక్షులను ఎంపిక చేయాలని కార్యకర్తలు ఆందోళన నిర్వహించారు.

16న బొగ్గు ఉత్పత్తిని నిలిపివేయాలి

సింగరేణి(కొత్తగూడెం): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 16న జరగనున్న సమ్మె, బంద్‌లో సింగరేణి పర్మనెంట్, కాంట్రాక్ట్ కార్మికులు స్వచ్ఛందంగా పాల్గొని బొగ్గు ఉత్పత్తిని, సంస్థ కార్యకలాపాలను స్తంభింపజేయాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ యూనియన్ సలహాదారుడు, స్ట్రక్చరల్ కమిటీ సభ్యుడు దమ్మాలాపాటి శేషయ్య కార్మికవర్గానికి పిలుపునిచ్చారు. స్థానిక ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో గురువారం జరిగిన యూనియన్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని బీజేపి ప్రభుత్వం కార్మికుల కష్టార్జితాన్ని పరిశ్రమల యాజమాన్యాలు, కార్పొరేట్ సంస్థలకు తాకట్టు పెడుతోందని, పోరాడి సాధించుకున్న చట్టాలని కార్మికులకు నష్టం చేసేవిధంగా మార్చి వేస్తోందని ఆరోపించారు. లాభాల్లో నడుస్తున్న ప్రభుత్వ రంగ సంస్థలను పెట్టుబడిదారులకు అప్పనంగా కట్టబెడుతూ కార్మికులను, ఉద్యోగులను నిరుద్యోగులుగా మారుస్తున్నారని ఆరోపించారు. బొగ్గు పరిశ్రమలను ప్రైవేట్ వ్యక్తులకు ధారదత్తం చేస్తూ ప్రైవేటీకరణను ప్రోత్సహిస్తోందని అదానీ, అంబానీ జపం తప్ప, మోదీ ప్రభుత్వంతో కార్మికులకు, ప్రజలకు ప్రయోజనం లేదని విమర్శించారు. ప్రభుత్వరంగ సంస్థలను కాపాడుకునే బాధ్యత ప్రతీ పౌరుడిపై ఉందన్నారు. ఈ పరిస్థితిల్లో 16న జరపతలపెట్టిన సమ్మె విజయవంతం చేయాలని కోరారు.



సింగరేణి(కొత్తగూడెం): మాట్లాడుతున్న శేషయ్య

ఇల్లెందు: కోల్‌ట్రాన్స్‌పోర్ట్, జీసీసీ, మున్సిపాలిటీలో సమ్మె నోటీస్‌లు అందజేశారు. గురువారం కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 16న జరగనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ కార్మికులు సమ్మెలో పాల్గొనబోతున్నారని తెలుపుతూ నోటీస్‌లు అందజేశారు. తొలుత మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, జీసీసీ సీనియర్ అసిస్టెంట్‌కు, కోల్ ట్రాన్స్‌పోర్ట్ ఉద్యోగులకు నోటీస్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘాల జేఏసీ నేతలు యాకుబ్ షావలీ, శంకర్, నాగయ్య, నబీ, కృష్ణ, సారంగపాణి, పాయం వెంకన్న పాల్గొన్నారు.



ఇల్లెందు: మున్సిపల్ చైర్మన్‌కు సమ్మె నోటీసు అందజేస్తున్న నాయకులు

సింగరేణి అభివృద్ధికి సహకరించండి

సింగరేణి(కొత్తగూడెం): సంస్థలో పనిచేసే ప్రతీ ఉద్యోగి అంకితభావంతో పనిచేసి సింగరేణి అభివృద్ధికి సహకరించాలని కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం శాలెంరాజు అన్నారు. గురువారం కొత్తగూడెం ఏరియా పరిధిలోని గౌతంఖని ఓపెన్‌కాస్ట్ గనిలో మల్టీ డిపార్ట్‌మెంట్ టీమ్ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. సంస్థ ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 2000 పరిశ్రమలకు బొగ్గును రవాణా చేస్తోందని, సింగరేణి సంస్థపై వినియోగదారులు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా వారికి నాణ్యమైన బొగ్గును అందించేందుకు ఈ మల్టీ డిపార్ట్‌మెంట్ సమావేశాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఏరియాలోని మన గని, మన బాధ్యతలను వివరించే ఈ సమావేశం ఏర్పాటు చేసిన సింగరేణి సీఅండ్ఎండీకి అభినందనలు తెలిపారు. అనంతరం డీజీఎం (ఐఈడీ) ఎస్.యోహాన్ సింగరేణి సంస్థ ఉత్పత్తి, ఉత్పాదకత, యంత్రాల పనితనం, ఉద్యోగుల సంక్షేమంపై సంస్థ తీసుకుంటున్న చర్యలను పవర్‌పాయింట్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం జీవీ కోటిరెడ్డి, ఏజీఎం దుర్గాప్రసాద్, ఏజీఎం ఫైనాన్స్ కే.హేనా సుమలత, జీకేఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ శ్రీరమేష్, ప్రాజెక్ట్ ఇంజనీర్ ఏ.శ్రీధర్, మేనేజర్ ఎస్.శ్రీరామచంద్ర మురళీ, రక్షణాధికారి వి.శ్రీనివాస్, సీనియర్ డీవైపీఎం ములకల శ్రావణ్‌కుమార్, ఇతర విభాగాల అధికారులు, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.



సింగరేణి(కొత్తగూడెం): జయశంకర్ గ్రౌండ్‌లో వాకర్స్‌తో మాట్లాడుతున్న జీఎం శాలెంరాజు

వాకింగ్ ట్రాక్ పరిశీలన...

కొత్తగూడెం ఏరియా గౌతంపూర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ గ్రౌండ్‌లోని వాకింగ్ ట్రాక్‌ను గురువారం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శాలెంరాజు సందర్శించారు. మాట్లాడుతూ.. సింగరేణి సంస్థ క్రీడాకారుల సౌకర్యార్థం రూ.లక్షలు ఖర్చు చేసి ఈ గ్రౌండ్‌ను అభివృద్ధి చేస్తోందని, ఈ గ్రౌండ్‌లో ప్రాక్టీస్ చేసుకున్న స్థానిక యువకులు అనేక ప్రభుత్వ, ఆర్మీ, పోలీస్ తదితర సంస్థలలో ఉద్యోగాలు సాధించినట్లు చెప్పారు. ఇక్కడికి వచ్చేవారు ఈ గ్రౌండ్ మనది అనే విధానంతో సద్వినియోగం చేసుకోవాలని, ఎలాంటి వ్యర్థాలు వేయరాదన్నారు.



ఇల్లెందు: గ్రౌండ్‌ను పరిశీలిస్తున్న జీఎం జాన్ ఆనంద్

ఇల్లెందులో...

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు జేకే హైస్కూల్ గ్రౌండ్‌ను ఏరియా జీఎం జాన్ ఆనంద్ పరిశీలించారు. గురువారం డీవైజీఎం జీవీ మోహన్‌రావుతో కలిసి గ్రౌండ్‌ను సందర్శించిన ఆయన అక్కడి ఫుట్‌బాల్ కోర్టు, రన్నింగ్, వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, షటిల్ కోర్టులను పరిశీలించారు. అభివృద్ధి పనులు త్వరిత గతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఏఐటీయూసీ నేత నజీర్ అహ్మద్, అధికారులు ఉన్నారు.